# బిచ్చగాడి పరిహాసం

ఆ రోజు నేనొక విఐపీని కలుసుకోవాలి. ఆయన్ను ఇంప్రెస్ చేశానంటే యాభై లక్షల టెండరు మా కంపెనీకి వస్తుంది. ఇలాంటి పనులకు బయల్దేరేటప్పుడు నేనెలాంటి డ్రస్సు వేసుకోవాలో నా భార్య శాంత నిర్ణయిస్తుంది. విషయం తెలిసి శాంత నా కోసం బూడిద రంగు సూటు ఎన్నిక చేస్తే నేనాశ్చర్యపోయాను.

ఆ డ్రస్సులో నన్ను చూస్తే మగాళ్ళకే మోహం పుడుతుందని తను పక్కన లేనప్పుడు శాంత నన్నా డ్రస్సు వేసుకోనివ్వదు.

"యాభై లక్షల టెండరు కోసం నేనీ త్యాగం చేస్తున్నాని గుర్తుంచుకోండి. మీరు టెండరు పని పూర్తికాగానే తిన్నగా ఇంటికొచ్చేయాలి."

"సరే, హేమంత్‌ని కూడా తీసుకుని వెడతాను" అన్నాను. హేమంత్ శాంత తమ్ముడు. మంచి ఫోటోగ్రాఫరు. బియ్యే పాసై నా దగ్గరే ఉంటున్నాడు.

మా ఇంట్లో వీడియో కెమెరా ఉంది. దాంతో దూరపు దృశ్యాన్ని కూడా క్లోజప్పులో తీయవచ్చు. ఇతరులకు తెలియకుండా వారిని కెమె రాలో బంధించడం హేమంత్ ప్రత్యేకత. నేను వాడిచేత ఎన్నో దృశ్యాలు వీడియో తీయించి పత్రికలకు, సినిమా వాళ్ళకు వ్యాపార సంస్థలకు అమ్మాను. ఆ విధంగా నా నుంచి వాడికి నెలకు పది వేల దాకా ముడుతోంది. దృశ్యం ఎన్నిక నాది. ఫిల్ము తీయడం వాడి పని.

"ఇప్పుడు మీతో వాడెందుకు?" అంది శాంతి.

"నేనిప్పుడు గ్రే సూటులో ఉన్నానుగా! నన్ను చూడగానే ఆడపిల్లల్లో కలిగే ముఖ భావాలు నీ తమ్ముడు ఫిల్ముగా తీస్తే అది ఏ బాంబే డైయింగ్ వాళ్ళో, విమల్ వాళ్ళో యాభై వేలిచ్చి కొనుక్కోవచ్చు" అన్నాను నవ్వుతూ.

శాంత తనూ నవ్వింది.

నేను, హేమంత్ కారెక్కాం. డ్రైవరు కారు స్టార్ట్ చేశాడు.

కలిగిన వారింట్లో పుట్టాను నేను. వడ్డించిన విస్తరి నా జీవితం. మా ఇంట్లో అంతా వ్యాపారస్తులైతే నేనొక్కణ్ణే ఉద్యోగస్తుణ్ణి. నాకో పెద్ద బంగళా, ఫర్నీచర్, ఇంపోర్టెడ్ కారు, నలుగురు పనివాళ్లు, కారు డ్రైవర్ - సకల సదుపాయాలూ కాక నెలక అయిదు వేల రూపాయల జీతాన్నిస్తోంది కంపెనీ. ఇదికాక బయట మీటింగ్‌లకనీ, గెస్ట్ ఎంటర్‌టైన్ మెంటనీ, టూర్స్‌కనీ సరాసరి నెలకు మరో అయిదు వేలు వస్తాయి. వైద్యం నాకూ, నా కుటుంబానికీ ఫ్రీ. మేము ఏడాది కొకసారి విమానంలో దేశమంతా తిరిగి రావచ్చు.

అయినప్పటికీ నేనీ ఉద్యోగం చేయడం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. వ్యాపారంలో ఇంతకంటే ఎన్నో రెట్లు సంపాదించవచ్చు. నా తెలివితేటలు స్వంతానికి ఉపయోగపడ్డం లేదని నాన్న బాధ. ఏ మాత్రమూ టెన్షన్ లేకుండా లైఫ్ ఎంజాయ్ చేయాలంటే స్వంతానికి పని చేయకూడదని నా సిద్ధాంతం.

కంపెనీ ఉద్యోగం కారణంగా మా ఇంట్లో నాన్నకూ, అన్నలకూ లేని ఫ్రీ టైం నాకుంది. ఫ్రీ టైముంటేనే నా మెదడు మరింత పనిచేస్తుందని తెలిసిన కంపెనీ యాజమాన్యం కూడా నన్ను పువ్వులా చూసుకుంటున్నారు.

పెద్దల కిష్టం లేకపోయినా నేను ఏరి కోరి ఓ మధ్యతరగతి అమ్మాయిని వివాహం చేసుకున్నాను. మధ్య తరగతి ఆడపిల్లలకు భర్తతో కలిసి జీవించాలన్న సరదా ఉంటుందన్న నా అభిప్రాయాన్ని శాంత నిజం చేసింది. ఆమెకు తనదంటూ వేరే లోకం లేదు. నేనే ఆమెకు సర్వస్వం!

నా బావమరిది హేమంత్ కూడా తన అక్కలాగే ఎంతో మంచివాడు. నా మూలంగానే పంపాదనాపరుడినయ్యానన్న కృతజ్ఞత కారణంగా వాడికి నా మాటంటే వేదం!

ఇప్పుడు నా వయసు ఇరవై ఎనిమిది. శాంత నా కంటే మూడేళ్ళు చిన్న. హేమంత్ కిరవై నాలుగు. నాకు పెళ్ళై రెండేళ్ళయింది. ఇంకా పిల్లలు లేరు.

స్వర్గంలా ఉన్న నా జీవితం గురించి నేనాలోచిస్తుంటే మా కారుకి సడన్ బ్రేకు పడింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో ఓ చిన్న పిల్ల ప్రాణాలు రక్షించాడు.

మా కారు చుట్టూ జనం మూగారు. ఇలాంటివి నాకు చిరాకు. నేను కారు దిగి కాస్త దూరంగా వెళ్లాను. హేమంత్ నన్ననుసరించాడు.

తప్పు పూర్తిగా ఆ చిన్న పిల్లది. తండ్రి చేయి విదిలించుకుని రోడ్డుకి అడ్డంగా పరుగెట్టింది. అందుకని డ్రైవర్ తండ్రినీ, ఆ పిల్లనూ తిడుతూంటే వాళ్ళు క్షమార్పణ చెప్పుకుంటున్నారు. జనంలో కొందరు డ్రైవర్ని దబాయించాలని చూస్తున్నారు. కానీ తప్పు చేసినప్పుడే దబాయించగల శక్తి ఉన్న మా డ్రైవరిప్పుడూరుకుంటాడా?

నాకా దృశ్యం పట్ల ఆసక్తి లేదు. నేను చూస్తున్న దృశ్యం వేరొకటి.!

అప్పుడు నేనో చెట్టునీడలో ఉన్నాను. నాకు కాస్త దూరంగా ఓ బిచ్చగాడున్నాడు. వాడి వళ్ళంతా మట్టి కొట్టుకుంది. చింపిరి జుట్టు. మాసిన గెడ్డం. వాడి వంటి మీద చీలికలు, పీలికలైన నిక్కరుంది. దానికంటే గొచీ మేలు!

నేను వాడిని పరీక్షగా చూశాను. వాడి శరీరం శుష్కించింది. కళ్ళలో దీనత్వం. వాడికి నా వయసే ఉంటుంది.

ఉలిక్కిపడ్డాను. నాకూ, వాడికీ ఎంత తేడా? నా హృదయంలో ఏదో కదలిక...

అది కనిపెట్టాడో ఏమో "బాబూ! ఆకలి.. పది పైసలు ధర్మం చేయండి!" అన్నాడు ఆక్రోశిస్తున్నట్లుగా.

నేను వాణ్ణి దగ్గరగా పిలిచి పది రూపాయల నోటిచ్చాను. వాడు నా కాళ్ళ మీద పడిపోయాడు. నేను ప్రక్కకు తప్పుకున్నాను. వాడూ లేచి దూరంగా వెళ్ళాడు.

డ్రైవర్ నన్ను కారెక్కమని పిలిచాడు.

అప్పుడు నాలో ఓ కుతూహలం రేగింది. బూడిద పూసిన శరీరం వాడిది. బూడిద రంగు కోటు నాది. ఇప్పుడున్న వడ్డించిన విస్తరిలాంటి జీవితంలోనే నాకింకా ఎన్నో కోరికలున్నాయి. పాపం, వాడిది మనిషి బ్రతుకే కాదు. నాకులా బ్రతికే మనుషుల్ని చూసినప్పుడు నిరాశా నిస్పృహలు వాణ్ణి వేధించవా?"

నేను హేమంత్‌తో, "వాడికి తెలియకుండా వాడిననుసరించి ఫిల్ము తీయి. నేను వెడుతున్నాను" అన్నాను. హేమంత్ బుద్ధిగా తలూపాడు.

నేను విఐపీని కలుసుకున్నాను. అనుకున్న పనైంది. ఉత్సాహంగా ఇల్లు చేరుకుంటే శాంత నన్ను వెళ్ళిన పనయిందా అనడగలేదు. "మీ గ్రే సూట్ ఎంతమంది ఆడపిల్లల కళ్ళ పడింది?" అంది.

అందుకే శాంతంటే నాకిష్టం. ఎప్పుడూ నా గురించే ఆలోచిస్తూ నేను తనక్కాకుండా పోతానేమోనని భయపడుతూంటుంది. అందుక్కారణం అనుమానం కాదు. అభిమానం!

"హేమంత్ ఇంకా రాలేదా?"

"లేదు..వాడినెక్కడ వదిలారు?" అందామె.

"నా గ్రే సూటుని చూసిన ఓ అద్భుత వ్యక్తిని ఫిల్ము తీస్తున్నాడు. అది చూస్తే హృదయమున్న ప్రతీవాడూ చలించాలి"

ఆ అద్భుత వ్యక్తి ఎవరో తెలుసుకోవాలని శాంత కుతూహలపడింది. నేనామెను సస్పెన్స్‌లో ఉంచాను.

హేమంత్ రాత్రి ఎనిమిందింటికి వచ్చాడు. ఏమిటింత ఆలస్యమని అడిగితే "రోజంతా వాడి దినచర్యలో ప్రత్యేకించి చెప్పుకోతగ్గదేమీ కనిపించలేదు. నువ్వు చెప్పావు కాబట్టి ఏదో విశేషం తప్పక జరుగుతుందన్న నమ్మకంతో ఇంతవరకూ వేచి ఉన్నాను. నా శ్రమ వృధా పోలేదు. కానీ ఏం జరిగి ఉంటుందో నువ్వూహించలేవు" అంటూ నేను శాంతను సస్పెన్స్‌లో పెట్టినట్లు తను నన్ను సస్పెన్స్‌లో ఉంచాడు.

కుతూహలంగా వీడియో చూశాం. బిచ్చగాడి దీనదశనూ, అవతారాన్నీ చూసి కదిలిపోయిన శాంతకు కళ్ళ నీళ్ళు కూడా వచ్చాయి.

వీడియోలో ఆఖరి దృశ్యం వచ్చింది. అందులో వాడికి తనలాంటి స్నేహితుడే దొరికాడు.

"ఒరే అప్పిగా! పొద్దున్నుంచీ నీకో విశేషం చెప్పాలని చూస్తున్నారా. ఏమై పోయావు?" అన్నాడు నన్నాకర్షించిన బిచ్చగాడు.

"కొండన్న తిరుపతి వెడుతూ ఎగ్జిబిషన్ దగ్గర వాడి చోటునాకిచ్చాడు. అక్కడ బాగా గిట్టుబాటవుతోంది. ఇంతకీ విశేషమేమిటి?" అన్నాడు అప్పిగాడు.

"ఈ రోజు పెద్ద తమాషా జరిగింది. తల్చుకుంటే ఇప్పటికీ నవ్వాగడంలేదు..." అంటూ నన్నాకర్షించిన బిచ్చగాడు అదే పనిగా నవ్వసాగాడు. అప్పిగాడు వాణ్ణి విషయం చెప్పమని బ్రతిమాలగా బ్రతిమాలగా వాడు అతికష్టంమీద తన నవ్వు నదుపుచేసుకుని,'ఈ రోజో బాబుని చూశాను. కార్లోంచి దిగాడు. నన్ను చూసి జాలిపడి పదిరూపాయలిచ్చాడు' అన్నాడు.

"ఇందులో నవ్వడానికేముంది?"

"అది కాదురా.. ఆ బాబు సూటు, బూటు వేసుకున్నాడు."

"అయితే?"

"ఇంకా నీ కర్థం కాలేదా? అప్పుడెండ ఎలా మండిపోతోందంటే నాకు వంటి మీదున్న నిక్కరు కూడా తీసిపారేసి ఏ నీళ్ళలోనో దూకాలన్పించింది. ఆ బాబు షోకు కోసం వంటి మీద అన్ని బట్టలెలా ఉంచుకోగలిగాడో? చూస్తే జాలేసింది. ఓ మూల నాకా బాబు మీద జాలి దంచేస్తూంటే ఆ బాబు నాకేసి జాలిగా చూస్తున్నాడు. నవ్వాపుకోలేక చచ్చాననుకో! అప్పటిదాకా ఎందుకు - ఇప్పటికింకా వేడి తగ్గిందంటావా?" అంటూ నన్నాకర్షించిన బిచ్చగాడు నవ్వసాగాడు.

అప్పిగాడు తనూ నవ్వడం మొదలెట్టాడు.

నవ్వుతున్న వాళ్ళిద్దరూ మనుషుల్లాగే అనిపించారు నాకు!

ఇంట్లో నాలుగు గోడల మధ్య ఉన్నప్పుడు పల్చటి లుంగీలో కానీ, వీలుంటే అండర్ వేర్‌తోటే తిరిగే నేను బైటకు వెళ్ళాలనేసరికి మండుటెండలో ఫుల్ సూట్ ధరించాను. అది హాస్యాస్పదంగా ఉందని నాకు స్ఫురించలేదు.

బిచ్చగాడి జీవితం నికృష్టం కావచ్చు. కానీ వాడిదీ జీవితమే! నాకు లాగే వాడి జీవితంలోనూ బాధలు, కోర్కెలు, అసూయాద్వేషాలతో పాటు హాస్యం, సంతోషం కూడా ఉన్నాయి.ఇక మీదట బిచ్చగాళ్ళ గురించి ఆలోచించేటప్పుడు వారి జీవితాన్ని మెరుగు పర్చాలనుకోవాలని తప్ప.. వారిది జీవితం కాదనీ, వారు మనుషులు కారనీ అనుకోవడం పొరపాటు!

ఆ తర్వాత నేను సూటు వేసుకోవాలనుకున్నప్పుడల్లా బయటి వాతావరణాన్ని గమనించడం నేర్చుకున్నాను. సూట్లో ఏ మనిషిని చూసినా నాకు బిచ్చగాడి పరిహాసమే గుర్తుకొస్తూంటుంది. ★

*(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక - 7-6-'90)*